# అమెరికాకు లొంగిపోయిన మోడీ ప్రభుత్వం

- 12న దేశవ్యాప్త సమ్మెకు కదలండి
- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి
- రైతు సంఘాల నేతల డిమాండ్
- 'సంయుక్త కిసాన్ మోర్చా' కరపత్రాల ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపునిచ్చింది. మంగళవారం అబ్బనికుంటలోని తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు సమ్మె గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎం నాయకులు మాట్లాడుతూ, అమెరికాతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత వ్యవసాయ రంగాన్ని కుప్పకూలుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా నుంచి మొక్కజొన్న, పత్తి, సోయాబీన్ మరియు పాల ఉత్పత్తులపై ఎలాంటి సుంకాలు లేకుండా దిగుమతి చేసుకునేందుకు మోడీ ప్రభుత్వం అంగీకరించిందని విమర్శించారు. అమెరికా ప్రభుత్వం తన రైతులకు 50 శాతం సబ్సిడీ ఇస్తుంటే, భారత ప్రభుత్వం కేవలం 3 శాతం మాత్రమే ఇస్తోందని.. చౌకగా వచ్చే అమెరికా ఉత్పత్తులతో పోటీ పడలేక మన రైతులు దివాలా తీస్తారని హెచ్చరించారు. 13 నెలల పాటు రైతులు సాగించిన వీరోచిత పోరాటం సందర్భంగా ఇచ్చిన హామీలను కేంద్రం గాలికి వదిలేసిందని నాయకులు దుయ్యబట్టారు. పంటలకు మద్దతు ధర కల్పించకుండా, ఎరువుల సబ్సిడీలను తగ్గిస్తూ, పురుగుమందుల ధరలు పెంచుతూ రైతులపై పెను భారం మోపుతున్నారని విమర్శించారు. విద్యుత్ చట్టం-2025 ద్వారా వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును ఎత్తివేసేందుకు కుట్ర చేస్తున్నారని, కార్పొరేట్ కంపెనీల కోసం విత్తన చట్టాల్లో మార్పులు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామీణ పేదలకు అండగా ఉన్న మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసి, నిధులు తగ్గించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్లు సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, వల్లందాస్ కుమార్, సుధమల్ల భాస్కర్, టీయూసీఐ నాయకులు కొత్తపల్లి రవి, ఊరటి హంసల్ రెడ్డి, ముఖిడి పీరయ్య, బొజ్జం కరుణాకర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# 'రామప్ప' మహా శివరాత్రి జాతరను విజయవంతం చేయాలి

- కలెక్టర్ దివాకర టీఎస్
- 15 నుంచి 17 వరకు జాతర నిర్వహణ
- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశం




**వరంగల్ వాయిస్, ములుగు :** ములుగు జిల్లాలోని చారిత్రక రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జరగనున్న మహా శివరాత్రి మహోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, ఆలయ ఈవో మరియు వివిధ శాఖల అధికారులతో కలిసి జాతర ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మూడు రోజుల పాటు శివరాత్రి వేడుకలను ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా వైభవోపేతంగా నిర్వహించాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ముందస్తు ప్రణాళికతో పనులు పూర్తి చేయాలన్నారు. ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత లేకుండా నిరంతరం పారిశుధ్య పనులు చేపట్టాలి. భక్తుల కోసం ఎక్కడికక్కడ చలివేంద్రాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన భద్రత కల్పించాలి. వాహనాల నిలుపుదల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలి. జాతరలో అత్యవసర వైద్య సేవల కోసం హెల్త్ క్యాంప్‌లను ఏర్పాటు చేయాలి. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ముఖ్యమైన ప్రదేశాలలో మరియు పందిళ్ల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ ఇంజన్లను సిద్ధంగా ఉంచాలి. రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, రవాణాకు ఇబ్బంది లేకుండా చూడాలి. భక్తుల సౌకర్యార్థం హెల్ప్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాలతో జాతరను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఓరుగల్లు ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీక..

- ఘనంగా 'మహా శివరాత్రి-2026' ఉత్సవం
- హయగ్రీవాచారి గ్రౌండ్స్‌లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం
- పోస్టర్‌ను ఆవిష్కరించిన రాకేష్ రెడ్డి, జిల్లా ప్రభు చైతన్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఓరుగల్లు శివతత్వాన్ని, కళలను, మన సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం అట్టహాసంగా నిర్వహించనున్నారు. వరంగల్‌లోని గాయత్రి గ్రాండ్ హోటల్‌లో మంగళవారం ఈ వేడుకలకు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను ఇండస్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, ప్రముఖ యోగ సాధకులు జిల్లా ప్రభు చైతన్య, హిందువాహిని నేతలు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 15న హన్మకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్స్‌లో ఈ మహా ఉత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాన్ స్వామీజీ రాధామనోహర్ దాస్ గారి ఆధ్యాత్మిక ప్రసంగం, పద్మశ్రీ కిన్నెర మొగిలయ్య కిన్నెర ప్రదర్శన, ప్రముఖ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్, నల్గొండ గద్దర్, కాసర్ల శ్యామ్ గార్ల సంగీత విభావరి ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు 'కాకతీయ పురస్కారాలు' ప్రదానం చేయనున్నారు. యోగా సాధకులు జిల్లా ప్రభు చైతన్య మాట్లాడుతూ.. ప్రస్తుత తరం యువత వ్యసనాల వైపు మళ్లకుండా, వారిని సంస్కృతి, కళల వైపు మళ్లించేందుకు ఏనుగుల రాకేష్ రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వీహెచ్పీ నేత శ్రీ రామ్ ఉదయ్ మాట్లాడుతూ, గత ఆరేళ్లుగా ఈ వేడుక కేవలం ఒక సంస్థ కార్యక్రమంలా కాకుండా, ఓరుగల్లు ప్రజల పండుగగా, మినీ కుంభమేళాగా మారిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు నాగుర్ల కృష్ణమూర్తి, గడ్డం రఘు వంశీ, ఇండస్ ఫౌండేషన్ కార్యదర్శి పురుషోత్తం, కన్వీనర్ కత్తుల అభిషేక్, కోఆర్డినేటర్లు దీపక్, అఖిల్ రెడ్డి, శివ, మనోజ్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్టడీ మెటీరియల్ పంపిణీ



**వరంగల్ వాయిస్, దామెర:** విద్యార్థులు క్రమశిక్షణతో, పట్టుదలతో చదివి లక్ష్యాలను చేరుకోవాలని దామెర ఎంపీడీఓ గుమ్మడి కల్పన పిలుపునిచ్చారు. ప్రముఖ తెలంగాణ ఉద్యమ గాయకుడు ఇనుగుర్తి మధు జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రంలోని పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ కల్పన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమని, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. తన పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే మెటీరియల్ అందించిన ఇనుగుర్తి మధును ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ అధ్యాపకులు డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్, టీఎస్ఎస్ కళాకారులు వడ్లకొండ అనిల్, గొలుసుల రంజిత్, తమ్మడపల్లి పవన్, దీపక్, యాదగిరి, వరహాల గోపి, రంజిత్ తదితరులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



**వరంగల్ వాయిస్, మల్హర్ :** విద్యార్థులు తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలంటే స్పష్టమైన లక్ష్యం, సరైన ప్రణాళిక అవసరమని ఎడ్లపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచందర్ రావు అన్నారు. సోమవారం మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల కోసం 'కెరీర్ గైడెన్స్ మరియు కౌన్సిలింగ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా హాజరైన 'ఇంపాక్ట్' మోటివేషనల్ స్పీకర్స్ రాపెల్లి రాజన్న, ముదరి సదయ్య విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ అవగాహన సదస్సులో గ్రామ సర్పంచ్ జంగిడి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గణతంత్ర వేడుకల్లో కేయూ ఎన్‌సీసీ క్యాడెట్ల రికార్డు

**న్యూఢిల్లీ పరేడ్‌లో ఏడుగురు విద్యార్థుల ప్రతిభ**



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (10 తెలంగాణ బెటాలియన్) ఎన్.సీ.సీ క్యాడెట్లు తమ సత్తా చాటారు. జనవరి 26న నిర్వహించిన రిపబ్లిక్ డే పరేడ్, ప్రైమ్ మినిస్టర్స్ ర్యాలీ, గార్డ్స్ ఆఫ్ హానర్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాల్లో కేయూ క్యాడెట్లు విశేష ప్రతిభ కనబరిచి యూనివర్సిటీకి గర్వకారణంగా నిలిచారు. ఈ ఏడాది పరేడ్‌లో కళాశాల నుంచి మొత్తం ఏడుగురు క్యాడెట్లు పాల్గొనగా, వారిలో ఆరుగురు ఆర్మీ వింగ్‌కు, ఒకరు ఎయిర్ వింగ్‌కు చెందిన వారు. సీనియర్ అండర్ ఆఫీసర్ మహమ్మద్ బాబా అత్యుత్తమ క్యాడెట్‌గా ఎంపికై, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎన్.సీ.సీ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. గార్డ్స్ ఆఫ్ హానర్ కార్యక్రమంలో పాల్గొన్న బి.శ్లేష హష్మిత వర్మ , రాష్ట్రపతి, ప్రధానమంత్రి మరియు చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌లను కలిసే అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. ఈ ఘనత సాధించిన క్యాడెట్లు ఎండీ బాబా, పి.శ్రీనాద్, కే.ప్రమోద్, వై.ప్రవీణ్, కే.భైరాం, బి.శ్లేష హష్మిత వర్మలను కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన ఈ శిక్షణను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. జ్యోతి, ఆర్మీ వింగ్ కమాండర్ లెఫ్టినెంట్ డాక్టర్ స్వామి శాడ్డా, ఫ్లయింగ్ ఆఫీసర్ డాక్టర్ బి.ప్రసాద్ పాల్గొని క్యాడెట్ల కృషిని కొనియాడారు.